కథా నిలయం
1038
శ్రీకాకుళం

పిచ్చిదంపతులు

భగ్గుమని మండి పోతున్నది యెండ ప్రవహిస్తున్నది తారు లావా ద్రవంలాగా. ఆ వేడితో స్వేదాలు చిందించుకొంటూ జల్లి తట్టను మోస్తున్నాడా వృద్ధుడు. ఆ ముడుతలుబడ్డ ముఖంలో యెన్ని వేల భావనాస్రవంతులు యింకి పోయినవో ఎవరు చెప్పగలరు? అతని ప్రక్కనే పాదాలకు గుడ్డపేలికలు చుట్టుకొని ప్రవహించే వేడి ద్రవం మీద గులకను పేర్చుకొంటూ వస్తున్నదా యిల్లాలు. ఆ యిద్దరి ముఖాలు వాడిపోయివున్నా అవి ఆ వేదనలను సూచించడం లేదు. సోలిపోయి వున్నా విరక్తిని ప్రస్ఫుటింప జేయడం లేదు.

ఎవరా శ్రామిక దంపతులు? అరవయ్యోపడి దాటినా ఉదర పోషణార్థం బండలను పగులగొడుతున్నారు. ఎండలలో ముదిరి, నెత్తురింకి పడుచగట్టి, ఎండిపోయిన కండలను కరిగిస్తున్నారు. నాలుగిళ్ళు అడుక్కున్నా పొట్ట గడిచిపోయే అవకాశమున్నది. ఐనా ఆత్మాభిమానంతో. పౌరుషంతో బ్రతుకును సాగిస్తున్నారు....

ఎవరా నిర్మాణ శిల్పులు? ఆ దారి వెంబడే వెడుతున్నవి బస్సులు...పోతున్నవి కార్లు...కానీ వారి వంక చూచే అవసరం...వారిని గురించి ఆలోచించే ప్రమేయం ఎవరికి గలుగుతుంది? ఎప్పుడు గలుగుతుంది? ఎవరి ప్రపంచం వారిది! ఆ ముసలాడి జీవితానికీ ఒక చరిత్ర వున్నది. అది శిబి చక్రవర్తి త్యాగానికి తీసిపోనిది. కర్ణుని ఉదారతకు తక్కువ

కానిది. ఐనా నాటి త్యాగులు చరిత్రలో ఒక స్థానాన్ని ఏర్ప రచుకొన్నారు. నేటి ఉదారులు శ్రామికులు... వారికి చరిత్ర లేదు. ఉన్నా అది ప్రాంతీయ పరిమితమై పోయింది.

అసలా వృద్ధుడొక రైతు. ఆరెకరాల మాగాణి రెండు మడకల సేద్యం...ఎందుకిలాంటి స్థితికి వచ్చాడా అని ఆలోచిస్తే అతని వ్యక్తిత్వం అంతకుమించిన త్యాగపటుత్వం తెలుస్తుంది...

*   *   *

పేరు వెంకయ్య. కాపురమున్నది గ్రామమైనా ఆ ఊళ్ళో పట్టణ వాతావరణం గూడా వున్నది. రెండెకరాల పొగ తోటలో నాలుగు రూకలు వస్తుంటాయి. మిగిలిన నాలుగెక రాలలోనూ ఏవో నాలుగు పుట్లు ధాన్యం పండుతూనే వుం టుంది. ఉన్నస్థితిని మరీ ఉన్నతంగా పెంచుకోవాలనే ఆశ అతనిలో లేదు. అందుకే లేనిపోని పేరులకు అతను పోకుండా కాలం గడుపుతూ వచ్చాడు. ఇద్దరు బిడ్డలకు పెళ్ళిళ్లు చేయా లనుకున్నాడు అందరి లాగా కట్నాలిచ్చుకోలేక పోయినా ఏదో కలిగిన కానుకలిచ్చి పెళ్ళిళ్ళు గూడా పూర్తి చేశాడు. ఆ యిచ్చిన చోట్లు గూడా అంత శ్రీమంతమైనవిగావు గానీ కట్టా కుడువా మాత్రం లోటు లేదనే చెప్పాలి.

వెంకయ్య కాపురం ఏ ఒడిదుడుకులూ లేకుండా దొర్లి పోతూ వుంది. ఇద్దరు కుమార్తెలూ అత్తవారింటికి వెళ్ళి పోయారు గనుక యింటిలో వున్నది భార్యాభర్తలిద్దరే. కనుక ఆర్థికంగా అట్టే ఒడిదుడుకు లేవీ లేవు. పైగా పొగాకులో వచ్చిన మూడు వేల రూపాయలూ మిగులుగా వున్నాయి.

అనవసరమైన ఖర్చులు చేయడం అతని కట్టే అలవాటు లేదు గనుక ఆ డబ్బులు మిగులగలిగినై. అప్పుడప్పుడూ ఏవో తోచిన దాన ధర్మాలు చేయడం గూడా అలవాటుగా పెట్టు కొన్నాడు. భార్య రుద్రమ్మగూడా కొంచెం ఉదాత్త గల్గినదే అతనిమాట కెప్పుడూ ఎదురు చెప్పేది గాదు.

ప్రకృతి చాలా విచిత్రమైంది అదెంత సౌందర్యమైందో అంత ప్రమాదమైంది గూడా దానికి కోపం వచ్చినపుడు మంచి చెడ్డలు లేవు. మంచివారిని గూడా బాధిస్తుంది దానికి సంతోషంగా వున్నపుడు చెడ్డవారికి గూడా చక్కని ఆనందాన్ని కలుగజేస్తుంది. వెన్నెల వాన కురిపిస్తూ హాయిని గొలిపించిన ప్రకృతే కోపించింది. ప్రళయ మారుతంలో పగిలిపోయిందాకాశం. ఘనీభవించిన మేఘుడు వికటాట్టహాసం చేశాడు. వంకలు డొంకల నీళ్ళుకుంటూ పచ్చని పొలాలను ఊడ్చుకొని పోయినవి. చేతికందిన పంటలక్ష్మి సముద్రుని చూడ్డానికి చల్లగా పయనించింది. నెత్తీ నోరు మొత్తుకొన్న రైతాంగం ఉత్త కడుపులతో మిగిలిన చెత్తా చెదారాలను కుప్ప చేర్చుకొని మిత్తివాతపడ్డ గొడ్డూ గోదలను తలంచుకుంటూ గోడు గోడు మంటూ విలపిస్తున్నది.

వెంకయ్య ఒకసారి తన పొలాన్ని చూచి వచ్చాడు. మిరపపాదులు వున్న పోలికే కనిపించ లేదు. దొండపాదుల్లో ఉన్నవి ఎక్కడినుండో కొట్టుకువచ్చిన ముళ్ళకంచెలు. ఒక్క నిమిషం నిట్టూర్చి యింటికి మళ్ళుకున్నాడు. వస్తూ వస్తూ అతని దృష్టి గ్రామంలో పాఠశాలమీద పడింది. బడిపిల్ల లందరూ వెలుపల నిల్చున్నారు పైకప్పు కూలిపోయింది లోపల రికార్డు లన్నీ బాగా తడిసి పోయాయి. బల్లలు విరిగి గుల్లలై

పోయాయి. కూలిపోయిన విద్యాలయం ముంగిట గూడులేని పిట్టల్లాగా నిల్చున్నారు పిల్లలు. వారి ముఖాలు అతి విషాదంగా వున్నవి. ఉపాధ్యాయు లున్నారు గానీ వారిలో చైతన్యం సడలింది. కూలిన కొయ్యలను ఎత్తి పేర్చడానికి ప్రయత్నిస్తు న్నారు. ఆ పిల్లలకు గ్రామానికి జరిగిన నష్టంమీద ధ్యాస లేదు. ప్రతి వాని పొలమూ మునిగిపోయింది. ప్రతివాని వరు వులూ కొట్టుకుపోయాయి. కానీ—ఆ లేత హృదయాల కా నష్టం తెలిసి రాలేదు బడి కప్పు కూలి పోయిందనే భావం. అదొకటే పెద్ద నష్టను నే నమ్మకం వారిలో ఏర్పడ్డట్లున్నది. అందుకే ప్రతి ఒక్కని ముఖంలోనూ ఆవేదన అంగలు వేస్తూ వున్నది.

వెంకయ్య ఆ విషాదపూరిత వదనాలను తిలకిస్తూ అట్టే ప్రూన్పడి నిలిచిపోయాడు ఐదు నిమిషాలు. ఆ వెనుక మెల్లగా కూలిన కప్పును లాగుతున్న ఉపాధ్యాయులను పలకరించాడు. విలువైన చిత్రపటాలు పాడుపడ్డాయి. అవి బురదలో నాని పోయినై. అమూల్యమైన గ్రంథాలను దాచి పెట్టిన రెండు బీరువాలు ముక్కలై పోయినై. వెంకయ్య మెల్లగా పలుక రించాడు పరీక్ష లిక నెలరోజు లే వున్నాయట. బడిని యిక్కడ? ఏ విధంగా నడపాలో అర్థం గాదన్నారు. గ్రామంలో సాయం చేసేవా రెవరైనా వున్నారా అంటే అందరికీ గొడ్డలి పెట్టుగా దాపురించిన ఈ తుఫాను బాధా ఫలితంగా అలాంటి దేమీ జరిగే అవకాశం లేదని తేలిపోయింది. ప్రభుత్వం కొంతవరకే సాయపడవచ్చు కానీ పునాదు లంటుకొని కూలి పోయిన భవనాన్ని క్రొత్తగా కట్టించే శక్తి వున్నా వెచ్చించే అవకాశం లేదని తెలిసింది. ఇక బడి జరగడం ఎలాగా? ఆరు

వందల మంది బిడ్డలు నిరాశ్రయులుగా కనిపించారు వెంకయ్య దృష్టిలో. గ్రామంలో ఎవరి కొంపను వారు సరి పెట్టుకుంటు న్నారు. ఎవరి గుడిసెకు వారేదో కష్టపడి కప్పు వేయించు కుంటున్నారు. అందరికీ సంబంధించిన సాంఘిక క్షేమం కోసం, అభ్యుదయం నిమిత్తం అవతరించిన విద్యాలయాన్ని బాగు చేసే ఆలోచన యింకా ఎవరికీ పుట్టలేదు.

వెంకయ్య అక్కడనుండి సరాసరి యింటికి వెళ్ళాడు. తన యిల్లు తన నాన్నగారి హయాంలో కట్టింది. గట్టి పునాదు లతో లేచిన యిల్లయినా కప్పు చెదిరి పోయింది. రుద్రమ్మ క్రింద రాలిన పెంకులను పూడ్చి పోస్తున్నది. ఇంటి ముంగిట్లో పదిమంది కూలీలు కాచుకూర్చున్నారు. వెంకయ్య ఉదా రత వారికి తెలుసు గనుక సాయం కోసం వచ్చారు. వారితో మెల్లగా ఆ గుడిసెల వైపునకు వెళ్ళాడు. ఏమున్నది? సర్వం కడిగేసి నట్టుంది. అసలే అవి మేకపిల్లలకు వేయబడే గుడిసె ల్లాంటివి ఆ చిన్ని గుడిసెల్లో తట్టెడు సంసారాలు. ఏడుస్తు న్నారు పిల్లలు ఆకలికి. వెంకయ్య యింటికి వచ్చిందే పుట్టెడు ధాన్యాన్ని కొలిచాడు. రెండువందల రొఖ్ఖం యిచ్చాడు. రుద్రమ్మ బదులు చెప్పలేదు. చెప్పే స్వభావం ఆమెలో లేదు. ఆ సాయంకాలమే యిద్దరు అల్లుళ్ళు మనుష్యులను పంపిం చారు. చెరో నాలుగు వంద లిచ్చి పంపేశాడు. రుద్రమ్మ అటకాయించ లేదు.

ఆ రాత్రి సన్నగా వెన్నెల కాస్తున్నది. బడి వైపునకు వెళ్ళాడు. ఒక గుడ్డి దీపాన్నుంచుకొని కూలిపోయిన కొంప ముందు చలిమంట వేసుకుంటున్నాడు నరసయ్య. సౌంద ర్యాలను విరజిమ్ముతూ విజ్ఞాన వికాసాలతో కళకళలాడే

విద్యాలయం స్మశానవాటికలాగా కనిపించింది. వెంకయ్య చూడలేక యింటికి వచ్చాడు.

అతణ్ణి ఏదో మహిమాన్విత శక్తి ప్రేరేపించింది. కరుణారసాన్ని ప్రవహింపజేసింది. త్యాగ శక్తిని పుంజీభవింప జేసింది. లేచి కూచున్నాడు. ప్రక్కనున్న రుద్రమ్మ గూడా లేచి కూచున్నది.

"రుద్రీ! మనం ఏ నాటికైనా చచ్చిపోతాం గదూ" అన్నాడు వెంకయ్య. ఈ మాటలు విన్న. రుద్రమ్మ ఉలిక్కిపడింది.

"ఎఁ ఎందు కలా అంటున్నారు?" ప్రశ్నించింది రుద్రమ్మ.

"ఊరక నే... ఈ లోకంలో ఏముంది మనకు స్వంతం?"

"ఇదంతా వేదాంతం లాగుంది. నా కేం తెలుసు?"

"అవును. నాకూ తెలియదు. కానీ మనం ఏదైనా మంచి పనిచేసి చచ్చిపోదాము.

"ఇప్పుడు చేస్తున్నవి మంచి పనులేగా?

"కావచ్చు. అది నలుగురికీ ఉపయోగపడే పనిగా వుండాలి. నేనేం చేసినా ఎదురు చెప్పవు గదా?"

"నే నెప్పుడైనా చెప్పానా? చిన్నతనం నుండి మీ యిష్టంమీదనేగదా నడిచి పోతున్నా."

"ఇప్పు డలాగా అన్నంత మాత్రంలో చాలదు. మనం అవసరమైతే పస్తులు గూడా వుండాలి."

"ఇంతవరకూ దేవుని దయవల్లా ప స్తులేము. ఉండవలసి వస్తే వుంటే నేం? ఎందరో ప స్తున్నారు గదా?"

"ఐతే పడుకో" అంటూ పడుకున్నాడు వెంకయ్య. రుద్రమ్మ కేవీ అర్థం కాలేదు. ఐనా ఏ ముంది లే అనుకొని పడుకొన్నది.

* * *

ఆ మరునాటి ఉదయం ఇరవై మంది కూలిలతో వెళ్ళి దిగాడు వెంకయ్య బడి ఆవరణలో. పిల్లల కా విషయం తెలిసిందే పరమానందభరితు లయ్యారు. గ్రామం గ్రామంగా ఆశ్చర్యంలో మునిగిపోయింది. కోటికి పడగ త్తే కోటీశ్వరులు లేకపోయినా లక్షలార్జించిన లక్ష్మీపుత్రులకు కొదువ లేని దా పల్లెసీమ. అలాంటి మ త్తేభులున్న పల్లెలో గులకలు మోయడం అలవరచుకొన్నది రుద్రమ్మ ఇలాంటి పవిత్ర కార్యానికి ఎవరూ ముందంజ వేయుక పోయారు. వెంకయ్య నడుంకట్టి త్యాగరంగంలో దుమికాడు.

పునాదులను త్రవ్వి ఉన్నరాళ్ళను కుప్ప వేయించాడు. తానూ కూలీలతో పని చేస్తూనే వున్నాడు. రుద్రమ్మ కూలీలకు బువ్వచేసి పెడుతున్నది. చక్కని ప్లాను తయారైంది. రెండు కూటాలు. ఎనిమిది తరగతి గదులు, ఒక రీడింగు రూము, ఒక ఆఫీసుగది, ఒక లేబరేటరీ.. మూడు పాయఖానా దొడ్లు, కాంపౌండుతో చేరి ఎన్ని వేలవుతుందో అంచనా వేశారు. ఇరవై వేలతో ముగించవచ్చు నన్నారు. ఉన్నవి రెండు వేలు మాత్రమే. ఉన్న పొలంలో సగం వంతు అమ్మితే సరిపోవచ్చు. ఐనా వెనుకాడ కూడదని నిర్ణ

యిందుకొన్నాడు వెంకయ్య. రుద్రమ్మ మారు చెప్పలేదు. అతని కెదురుగా మాట్లాడ్డం ఆమె జీవితంలో లేదుగా!

పునాదులు వేయకముందే సగం పొలాన్ని అమ్మి వేశాడు. పదేను వేల రొఖ్ఖం చేతిలో పడింది. పని ప్రారంభ మైంది త్వరగా జరిగిపోతున్నది. పునాదులు పడి గోడలు పైకి లేచినై. రొఖ్ఖం అయిపోయింది. ఉన్నవి రెండు వేలు మాత్రమే మళ్ళీ పొలాన్ని అమ్మవలసిందే పని ఇంతటితో ఆగిపోతుందను కున్నారు కొందరు. దేనికైనా మంచిదని గ్రామస్థుల్లో ఒక రిద్దరి శ్రీమంతులను పలుకరించాడు. అందులో ఒకాయన ఘాటైన సమాధానం యిచ్చాడు. ఇంత మాత్రాని కెందుకు ప్రారంభించా లన్నాడు.

వెంకయ్య కా ఒక్క మాట శూలం పోటులాగా గుచ్చు కొన్నది. ఆ రాత్రి నిద్రపట్టలేదు. పొలాన్ని అమ్మాలను కున్నాడు. రుద్రమ్మను పల్కరించాడు. ఆమె బదులాడలేదు. వెంటనే పొలాన్ని అమ్ముతున్నానని నలుగురితో చెప్పాడు. ముందు పోటీలు పడ్డారు కొనడానికి. కానీ యీ మారు ఎటు దిరిగీ అమ్మక తప్పదని నలుగురూ కూడబలుక్కున్నారు. చివరికి పొరుగూరివారికి అమ్మేద్దా మనుకున్నాడు ఈ విష యం తెలిసి ఊళ్ళోవాళ్ళే ఒకరికి తెలియక మరొకరు పోటీలు పడ్డారు. అదృష్టం కొద్దీ మరో మూడు వేలు అధికంగానే వచ్చింది. పద్దెనిమిది వేలు చేతిలో పెట్టుకొన్నాడు. ఇక నేం పని ప్రారంభమైంది ఇనుము ధర ఆకసంలో నృత్యం చేస్తు న్నది. సిమెంటు ధర కూడా విపరీతంగా పలుకుతున్నది. కావలసినవి కొన్నాడు. ఆశ్చర్యమే మంటే పై మిద్దె కప్పు దగ్గరకు వచ్చేలోగా డబ్బు చాలకపోయింది. ఇక పని ఆగిపో

వలసిందేనా? ఆ మధ్యాహ్నం కూలీలకు అన్నానికే తగరార్రై పోయింది. సాయంకాలం కూలీలకు రేపిస్తానంటూ పంపి వేశాడు.

ఆ రాత్రి మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. ఉదయం కూలీలు వస్తారు వారికి డబ్బు లివ్వాలి. లోకం తన్ను యింకా పరీక్షి స్తూనేవున్నది. తానీ పరీక్షలో నెగ్గవలసి వున్నది.

"రుద్రీ" పలకరించాడు.

"ఏమండీ" సమాధానం

"ఏం చెయ్యాలో తోచడంలేదు."

"పడుకొని నిద్రించండి ఉదయం చెబుతాను."

"ఏముంది చెప్పడానికి"

"మామిడి పిందెల దండ వుందిగా? సమస్తమూ పోయిందిగా. ఇది మాత్రం ఎవరిని ఉద్ధరించడానికి. పని పూర్తి చేస్తే చాలు, అంత వరకూ నాకూ నిద్రపట్టదు."

"ఆఁ...నిజంగా యిస్తావూ?"

"ఎందు కివ్వనండీ? అది మీ సొమ్మేగదా. మీ సొమ్ము మీ కివ్వడంలో ఆశ్చర్యం లేదుగా?"

"నీకు పిచ్చా. అది నా సొమ్ము మాత్రం ఎలా అవు తుంది? దానిని ఖర్చుపెట్టకుండా నా వద్దనే వుంచుకుంటా ననుకో. నేను చచ్చినపుడది నాతో వస్తుందా? పైగా నేను చస్తే ఏమౌతానో నాకే తెలియదు. అయితే చావడం మాత్రం సత్యమని తెలుసు. ఆ సొమ్ము నా దని చెప్పడానికి నాకు హక్కున్నా యోగ్యత లేదు. ఆధారమున్నా అవకాశం

లేదు. ఇంతకూ మనల్ని పిచ్చివాళ్ళంటున్నారు కొందరు పడుకో" అన్నాడు వెంకయ్య.

ఉదయం బస్తీకి వెళ్ళి మామిడి పిందెల పేరును అమ్మి వేశాడు. పదేను వందలు వచ్చాయి. పని అభ్యంతరం లేకుండా సాగిపోయింది. వెల్ల వేయించాడు గూడా. ప్రారంభోత్సవం జరిగిపోయింది. పిల్లలు నవ్వు ముఖాలతో బడిలో ప్రవేశించారు. వారు తాతయ్యతో ఫోటోలు తీయించుకున్నారు.

ఆ రాత్రి ఆనందంతో నిద్ర పట్టలేదు వెంకయ్యకు రుద్రమ్మ కూడా మాట్లాడుతూనే వుండి పోయింది.

*　　　　*　　　　*

కట్టలేని చెరువు, చెట్టులేని చేను యెంతో కాంపౌండు లేని కట్టడం కూడా అంతే. ప్రాకారం లేని భవనానికి అందం లేకుంటే మానెగానీ భద్రత కూడా వుండదు. అట్టి కంచెలేని చేనులాగా పరిగిలి పోతుంది. బడికి కట్టడం వుంటే చాలదుగా! నాలుగు పూలమొక్కలుండాలి. అప్పుడే అందంతో పాటు విశాలత్వాన్ని గూడా ఇవ్వగల్గుతుంది.

ఓనాడు సాయంకాలం వెంకయ్య బడివైపున వస్తుంటే బడిచుట్టూ పశువులు గెంతుతున్నాయి. పిల్లలు తరుము తున్నారు. ఆ ప్రక్కనే చిన్న గుడిసెలో గంపెడు సంసారం కాపురమున్నది. తానూ ఒక పెద్ద పెంకుటెంటిలో కాపుర మున్నాడు. ఉన్నవి రెండే ప్రాణాలు. ఎక్కడుంటేనే మనిపిం చింది. కానీ యింటిని అమ్మడమా! రైతు పొలాన్ని అమ్ము కోగలడు. రైతాంగన కూడా అందుకు అతి కష్టంగా ఓర్చు కుంటుంది. కానీ "ఇల్లు లేనమ్మ ఈనం చెడె మగడు లేనమ్మ

మానం చెడ" అనే లోకోక్తి పల్లెల్లోనే పుట్టింది. గనుక ఇంటిని అమ్మడానికెలాంటి పరిస్థితుల్లోనూ ఆమె ఒప్పుకోదు.

అంతే జరిగింది గూడా. త్యాగానికీ కూడా ఒక పరిమితి వుండాలిగా. పొలం పోయినా కూలో నాలో చేసి గూడు చేరుకోవచ్చు. ఆ గూడు కూడా లేకుంటే కూడు దొరికి మాత్రం ఏం లాభం?

రుద్రమ్మ ఒప్పుకోదని తెలిసినా వెంకయ్య అడిగేశాడు. రుద్రమ్మ నిరాకరించింది. కానీ నాలుగైదు రోజులుగా వెంకయ్య పడుతున్న ఆవేదనను చూచి అంగీకరించింది. ఐదు వేల రూపాయలకు ఇంటిజాగా ధర చెప్పాడు. నాలుగు వేలకు బేరం కుదిరింది.

వెంకయ్య డబ్బు లెత్తుకొని పని ప్రారంభించాడు. కావలసింది డబ్బులేగా. పైకం చేతిలో వుంటే జరుగని పనంటూ ఏదైనా వుందా?

ఈ దఫాలో మాత్రం గ్రామంలో చాలమందికి మనస్సు మారింది. కానీ ఆ మార్పు ఇల్లును అమ్మక ముందైతే ఎంత బావుండేది? వెంకయ్య తాను పట్టిన పనిని పూర్తి చేయాలను కున్నాడు. పూర్తి ఐపోయింది గూడా. పని ముగిసిన నాటి రాత్రి పండు వెన్నెలలో ఒక్కసారి భవనాన్ని చూచాడు.

ఆ రాత్రి రుద్రమ్మతో చెప్పాడు. ఇక మన జీవితంలో సాధించగల్గిందేమీ లేదన్నాడు. ఉదర పోషణంకోసం బెంగ పడవలసిన అవసరం గూడా లేదు. రాతిలోవున్న కప్పకు కూడా ఆహారం దొరుకుతున్నపుడు నేలమీద యిందరి ప్రజల

మధ్య మనం బ్రతుకలేక పోతామా అంటూ ధైర్యం చెప్పాడు.

ఆ మఱనాడు సాయంకాలం రుద్రమ్మ బడివైపు వెళ్ళినది. రేడియోలో పాట విన్పిస్తున్నది.

"తండ్రి సుఖానికి గాంగేయుడు తన
పెళ్ళి మానుకోలేదా?
కర్ణుడు కవచం బీలేదా?
శిబి మైకండల నీలేదా?"

పిల్లలు హాయిగా బంతు లాడుకుంటున్నారు. ఆమెను చూచి ప్రధానోపాధ్యాయుడు దగ్గరికి వచ్చి లోపలికి పిలుచుకొని వెళ్ళాడు. ప్రతి గదీ చూపించాడు. హాలులో వెంకయ్య చిత్రం నిలువెత్తున వ్రేలాడగట్టబడింది. ఎంత బావున్నదా బొమ్మ!

"దేవుడుంటే, స్వర్గంవున్నది నిజమైతే మీ దంపతులక్కడ శాశ్వతస్థానంలో వుంటారమ్మా" అన్నాడు ఒక పంతులు.

"ఆ స్వర్గాని కంటే ఈ బడిలో వుండడమే ఎంతో బావున్నది" అన్నది రుద్రమ్మ నవ్వుతూ.

అవును పాపం! కానీ బడిని చూచుకొంటూ వుండిపోతే జీవనం ఎలా జరుగుతుందో ఆమెకు తెలియదుగా!

వెంకయ్య కూలిచేయడం అంటే ఎంత ఆశ్చర్యమో రుద్రమ్మకు తెలుసు. రుద్రమ్మ పొలంపని చేయడం క్రొత్తగాక

పోయినా కూలిచేయడమంటే ఎంత సంకటమైన సంగతో వెంకయ్యకు తెలుసు.

అమాయకులు, నిజంగా పిచ్చి మనుష్యులు. ఒకరి కష్టాల కొరకు నొచ్చుకొంటారు గనీ స్వీయ కష్టాల గురించి ఆలోచించరు.

నలుగురిలోనూ బాగా బ్రతికిన కాపురంగనుక కూలీ చేయడం కొంచెం లోకువగా కనిపించవచ్చు సంఘంలో. ఐనా వెంకయ్య అందుకు జంకడం లేదు. పొలం పనులు లేని సమయంలో గూడా ఏ కాలువలు త్రవ్వడమో, రోడ్డుపనులో దొరికితే చాలు వెడుతుంటాడు.

* * *

త్యాగానికీ ఒక పరిమితి వుంది అనేవాదం వెంకయ్య విషయంలో ఓడిపోయిందనే చెప్పాలి. అన్నివిధాలా తగిన యిల్లాలు రుద్రమ్మ. బహుశా వాల్మీకి గానంచేసిన సీతమ్మ త్యాగంగూడా ఈమెతో సరితూగక పోవచ్చు. ఆమె రాణి గనుక వనవాసం చేసిన ఘట్టాన్ని తలంచుకొని జాలిపడు తుంది మానవ హృదయం. అలాంటి సీత సహితం శ్రీరాముని పై తిరుగబడిన సంఘటనలు లేక పోలేదు. లక్ష్మణునిపై గయ్యాళిలాగు విరుచుకొని పడిన రోజులు లేకపోలేదు. పైగా ఆమె ఎక్కడా కూలి చేయలేదుగా. రుద్రమ్మ విషయం అలా కాదు. ఆమె రోడ్డు కూలీలతో చెట్లక్రింద కాపురం చేయడం నేర్చుకొన్నది. మగనితోపాటు వృద్ధాప్యంలో కాలే యెండ లలో గులకలు మోయడం అలవరచుకొన్నది. జానెడు పొట్ట కోసం ఆమె యింత కష్టపడవలసిన అవసరంలేదు. ఉన్న

యిద్దరు కుమార్తెల్లో ఏ ఒక్కరైనా ఆమెను పూలలోపెట్టి పూజిస్తూ పోషించుకోగలరు. కానీ ఒకవిధంగా వారికి చెంద వలసిన ఆస్తిని దానం చేసి పైగా వారికి భారంగా వెళ్ళి కూచోరాదని ఆమె నిర్ణయం. వెంకయ్య ఆలోచనగూడా అంతే.

ఆశ్చర్యమేమంటే ఆసంపాదనలో గూడా దానధర్మాలు యథాతథంగా జరిగిపోతున్నాయి. కూలీల బాగోగులను చూడడంలో దంపతు లిద్దరికీ యెంతో శ్రద్ధ. వెంకయ్య పెద్ద రికం వారి కెంతో బాగా నచ్చింది. ఇందుకు ప్రధాన కారణం లేకపోలేదు. రోడ్డు కూలీలకు పెద్దగా వుండేవాడెపుడూ పని చేయడు. మేస్త్రీతో బాతాఖానీ చేస్తూ కూచుంటాడు. ఇందుకు ఫలితంగా ఒకటిన్నర రెట్లు అదనంగా కూలీ తీసుకుం టాడు. వెంకయ్య ఆలా కాదు. అందరితో పాటు నడుం వంచి పనిచేస్తాడు. అందరికీ యిచ్చి చివర కూలి తీసుకొంటాడు. అందుకే అతణ్ణి అందరూ అమితంగా ప్రేమిస్తారు.

ఇంతకూ వెంకయ్య అమాయకుడు, నిజంగానే పిచ్చి వాడు. ఈ ఇరవయ్యో శతాబ్దంలో యీలాంటి వ్యక్తి కాగ డాలు పెట్టుకొని గాలించినా ఈ దేశంలో కనిపించరని చాల మంది అనుభవజ్ఞులే అనగలరు. అంటున్నారు గూడా. ఇందులో గూడా ఆశ్చర్యంలేదు. బడికని గుడికని లక్షల రూపాయలు ప్రోగుచేసి అందులో సగం మ్రింగిన రాబందులున్నారు మన లోనే. అక్కడికి నయం. అసలు మొత్తాన్ని జీర్ణించుకొన్న మహానుభావులున్నారుగా!

అలాంటి హేమాహేమీ లున్న ఈ సంఘంలో రుద్రమ్మ

వెంకయ్యాలు తమ విలువైన ఆస్తిని త్యాగం చేసి చివరికి యింటిని గూడా అమ్ముకొని కూలి చేసుకొని బ్రతుకుతున్నారంటే. లోకం నమ్ముతుందా?

అవును లోకం నమ్మదు. కానీ వెంకయ్య బడిలో చదువుకుంటున్న పిల్లలు నమ్ముతారు. అక్కడ పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయులు నమ్ముతారు. అతని త్యాగానికి అబ్బురపడి కావ్య కన్యలను కృతులిచ్చి భక్తితో అంజలి ఘటించిన మహాకవులు నమ్ముతారు. ఆ కృతులు చదివిన పాఠకులు నమ్ముతారు. అంత చాలుగా!

ఒక సమయం లోకం నమ్మినా. వారాస్తిపాస్తులను అమ్మి దానం చేశారని ఋజువు కనబడినా వారు పిచ్చిదంపతులటుంది. నిజమే. వారు. పిచ్చి దంపతులే. అలాంటి పిచ్చి అందరికీ వుంటే సంఘం యిలాగా పుచ్చిపోతుందా? సంస్కృతి యీ విధంగా చచ్చిపోతుందా లోకంలో!

— :0: —

'పాతాళగంగ' కథాసంపుటి (మే 1969) నుండి సేకరణ.